క్లుప్తంగా

ఘనంగా ఏకాదశ మన్యుహోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: ధ్వజ సూర్యనారాయణ, సంతాన నాగేంద్ర మూషిక వాహన పునఃప్రతిష్ఠ పూజల్లో భాగంగా పట్టణంలోని శ్రీ విజయగణపతి దేవాలయంలో ఆదివారం ఏకాదశ మన్యు హోమం ఘనంగా నిర్వహించారు. సామూహిక లక్ష్మి గణపతి నవగ్రహ హోమాలు, ఏకాదశ మన్యు హోమం, పరివార దేవతా హోమం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ అర్చకులు రాజేందర్ శర్మ, సతీష్ శర్మ, రామకృష్ణ శర్మ, సురేష్ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

'పరిహారం అందేలా చూస్తాం'

వేమనపల్లి: భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూస్తామని మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌అలీ హామీ ఇచ్చారు. నష్టపోయిన పంటలను, కుంగిపోయి న కల్వర్టులను ఆదివారం నాయకులతో కలిసి పరిశీలించారు. నష్టపోయిన వివరాలను ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లి, కలెక్టర్‌తో మాట్లాడి సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పిస్తానన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీలు లింగాగౌడ్, వెంకటేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు ఒడిశ్ల రాజన్న, గాలి మధు, రాంచందర్, కిష్టయ్య, మోర్ల రమేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు బ్రేక్

జన్నారం: మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు ఉప్పొంగడంతో లోతొర్రే, లక్ష్మీపూర్, గొండుగూడ గ్రామాలకు ఆదివారం కూడా రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు, ఎమ్మెల్యే స్పందించి వాగుపై వంతెన నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పంట నష్టంపై సర్వే



వివరాలు సేకరిస్తున్న ఏవో సృజన

నెన్నెల: మండలంలో భారీ వర్షానికి జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు నెన్నెల మండలంలో ఆదివారం సర్వే చేపట్టారు. మండల వ్యవసాయాధికారి సృజన, ఏఈవో రాంచందర్ క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు సేకరించారు. 330ఎకరాల్లో పత్తి, 207ఎకరాల్లో వరి పంట దెబ్బతిందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు చెప్పారు. ఎన్ని ఎకరాల్లో పంట వేశారని, ఎంత నష్టం వస్తుందని పత్తి, వరి సాగు చేసిన రైతులను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని రేణుక ఎల్లమ్మ గుడి వద్ద ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని బీసీ కార్పొరేషన్ చైర్మన్, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గౌడ కులసంఘం ఉపాధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మడిపెల్లి వెంకటేశ్వర్‌గౌడ్ ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతగా నిలిచిన ముంబయి ఇండియన్స్ జట్టు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని శివాజీ గ్రౌండ్‌లో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మంచిర్యాల ప్రీమియర్ లీగ్ అండర్–17 క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతగా ముంబయి ఇండియన్స్(ఎంఐ) నిలవగా, రన్నర్స్‌గా సీఎస్‌కే నిలిచింది. విజేతలకు మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్, మెడికేర్ ఆస్పత్రి నిర్వాహకులు మహేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దుర్గాప్రసాద్, సీనియర్ క్రికెటర్లు ఏ.విజయ్, వివేక్, ఆంబ్రోస్, బుష్, తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారికి బోనాలు





చెన్నూర్: చెన్నూర్ మహంకాళివాడలో గల మహంకాళి అమ్మవారి బోనాల జాతరను భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారి ఆలయం వరకు పోతరాజులు, శివసత్తుల విన్యాసాల మధ్య శోభాయాత్ర కనుల పండువగా సాగింది. శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు



జన్నారం: మండలంలో లంబాడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. యువతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాగు వద్ద తీజ్‌ను నిమజ్జనం చేశారు. నృత్యాలు ఆకట్టుకున్నాయి.

వృద్ధిలోకి వస్తున్న వనం

- 27.6 రిజర్వు ఫారెస్టు భూమిలో వనాల పెంపకం
- ఏపుగా ఎదుగుతూ పచ్చదనం పంచుతున్న మొక్కలు

బెల్లంపల్లి: ఖాళీగా ఉన్న అటవీ ప్రదేశాల్లో చేపట్టిన మొక్కల పెంపకం సత్ఫలితాలు ఇస్తోంది. వనమహోత్సవంలో భాగంగా అటవీ శాఖ అధికారులు నాటిన మొక్కలు ఏడాది వ్యవధిలోనే ఏపుగా ఎదిగి, కనువిందు చేస్తున్నాయి. మొక్కల పెంపకం వల్ల వనాల సంతతి క్రమంగా వృద్ధి చెందుతోంది. ఇందులో భాగంగా కోతులకు ఆహారాన్నీ అందించడానికి ఫలసాయాన్నీ ఇచ్చే మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. బెల్లంపల్లి అటవీ రేంజ్ పరిధి పాత బెల్లంపల్లి గ్రామ శివారులో 27.6హెక్టార్ల అటవీ భూ విస్తీర్ణంలో గతేడాది వనమహోత్సవంలో భాగంగా అటవీ శాఖ అధికారులు మొక్కల పెంపకం చేపట్టారు. రిజర్వు ఫారెస్టు భూమిని ఖాళీగా ఉంచకుండా రెండేళ్ల వ్యవధిలో 46వేల మొక్కలు నాటారు. గతేడాది నాటిన మొక్కల్లో కొన్ని చనిపోగా వాటి స్థానంలో ఇటీవల కొత్తగా మరో 15వేల పైచిలుకు మొక్కలు నాటారు. ఎంతో విలువైన, కనుమరుగై పోతున్న అటవీ వృక్షాలకు సంబంధించిన మొక్కలను నాటి, కంటికి రెప్పలా కాపాడుతున్నారు. నాటిన మొక్కలు ప్రస్తుతం నిలువెత్తు పెరిగి పచ్చదనం సంతరించుకొని అలరారుతున్నాయి. చూడముచ్చట గొల్పుతున్నాయి.



ఏపుగా ఎదుగుతున్న మొక్కలు

ఆహ్లాదం పంచుతున్న వనం..

రెండేళ్ల క్రితం వరకు నామమాత్రంగా ఉన్న అటవీ ప్రాంతం మొక్కలు ఎదుగుతుండటంతో నిండైనా రూపం సంతరించుకుంది. పాత బెల్లంపల్లి గ్రామాన్నీ ఆనుకొని రోడ్డు పక్కన పెరుగుతున్న మొక్కలు గ్రామస్తులకు ఎంతో ఆహ్లాదాన్నీ పంచుతున్నాయి. అంతరించిపోయిన అటవీ వనాలు జీవం పోసుకొని, అటవీ ప్రాంతం వృద్ధి చెందే దిశగా కనబడుతోంది. గ్రామీణులు కలిసి వస్తే మరింత వృద్ధిలోకి వచ్చే అవకాశాలు ఉంటాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.

పెంపకం చేపట్టిన మొక్కలివే...

వనాల పెంపకానికి అటవీశాఖ అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా కనుమరుగవుతున్న వృక్షాల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. వీటిలో రావి, వేప, మర్రి, జువ్వి, నెమలి నార, నారేప, ఇప్ప, చింత తదితర రకాల మొక్కలు ఎంతో ముఖ్యమైనవి. నాటిన మొక్కల్లో 30శాతం వరకు కోతులకు ఆహారంగా పండ్లను ఉత్పత్తి చేసే అల్లనేరేడు, ఇరికి, ఉసిరి తదితర రకాలు ఉన్నాయి. ఇవి మరి కొన్నేళ్లలో ఫలసాయాన్నీ ఇచ్చే స్థితికి చేరుకునే అవకాశాలు ఉన్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. తద్వారా ఆహారం కోసం వనాన్నీ వీడి కోతులు గ్రామాలకు వెళ్లే అవకాశాలు ఉండవని భావిస్తున్నారు.

భావితరాలకు ఉపయోగం...

రిజర్వు ఫారెస్టు భూమిని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా పలు రకాల మొక్కలను గతేడాది నాటించి కాపాడాం. ప్రస్తుతం ఆ మొక్కలు నిలువెత్తు పైగా ఎదిగి పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. పాతబెల్లంపల్లి గ్రామానికి కూతవేటు దూరంలో రిజర్వు ఫారెస్టు భూమి ఖాళీ లేకుండా మొక్కలతో కళకళలాడుతోంది. ఈ మొక్కలను కాపాడాల్సిన కనీస బాధ్యత గ్రామస్తులపై ఉంది. కంటికి రెప్పలాగా కాపాడుకొని భావితరాలకు కానుకగా ఇవ్వాలి.

– పూర్ణచందర్‌రావు,ఎఫ్‌ఆర్‌వో, బెల్లంపల్లి

'మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం'



స్థానికులతో మాట్లాడుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. జిల్లా కేంద్రంలో వరద నీరు చుట్టుముట్టిన చున్నంబట్టి వాడ, కృష్ణనగర్, సూర్యనగర్‌లను ఆదివారం ఆయన సందర్శించారు. అనంతరం రఘునాథ్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలు వర్షపు నీటితో నిండిపోతున్నాయని, కనీసం వరద నీరు వెళ్లే పరిస్థితి కూడా లేకపోవడం దారుణమన్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కాలనీ ప్రజలకు భరోసా ఇచ్చారు.

'ఎకరాకు రూ.25వేల పరిహారం అందించాలి'

లక్సెట్టిపేట: ఇటీవల కురిసిన వర్షాలతో పంటనష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల నష్ట పరిహారం అందించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్ చేశారు. లక్సెట్టిపేట మండలం కొమ్ముగూడెం చెరువుకింద వరద తాకిడిలో నష్టపోయిన పంటలను ఆదివారం పరిశీలించారు. కొమ్ముగూడెం చెరువు సమీపంలో ఉన్న ఒర్రెపై గల లోలెవల్ వంతెనతో వరద నీళ్లు ముందుకు వెళ్లక, ఏటా వరద సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన నిర్మాణానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి శంఖుస్థాపన చేసి ఏడాది గడుస్తున్నా, పనుల జాడే లేదని ఆరోపించారు. వెంటనే వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. పార్టీ నాయకులు ముత్తె సత్తయ్య, బొప్పు కిషన్, బియ్యాల లచ్చన్న, బొక్కనపెల్లి సతీష్, వెంకటేష్, రవీందర్, శశిధర్, సతీష్‌రావు, ప్రవీణ్, జయరామరావు ఉన్నారు.

పల్లెల్లో పెరిగిన దోమల బెడద

- మూలకు చేరిన ఫాగింగ్ మిషన్‌లు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు



మరమ్మతులకు నోచుకోని ఫాగింగ్ మిషన్

కోటపల్లి: గ్రామపంచాయతీల్లో నిధుల కొరత సాకుతో అధికారులు పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దోమల నివారణకు జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్‌లు చాలా పంచాయతీల్లో చెడిపోగా, మరికొన్ని గ్రామపంచాయతీల్లో మిషన్లు మాయమయ్యాయి. పల్లెలు దోమకాటుకు విలవిలలాడుతున్నాయి. గ్రామాల్లో దోమల నివారణకు వైద్యశాఖ, పంచాయతీ సిబ్బంది కనీస చర్యలు తీసుకోకపోవడంతోనే ఆసుపత్రిలో జ్వరాల కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు ఇతర వైరల్ జ్వరాలు తాండవం చేస్తున్నాయి. దోమల నివారణకు కొనుగోలు చేసిన యంత్రాలు కొన్ని పంచాయతీల్లో లేకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో యంత్రానికి రూ.35వేల నుంచి 60వేల వరకు వెచ్చించి కొనుగోలు చేసింది. మిగితా గ్రామాల్లో మేజర్ పంచాయతీల నుంచి అడపాదడపా తీసుకొని పారిశుధ్య కార్మికులు ఫాగింగ్ చేస్తున్నారు. మరికొన్ని గ్రామపంచాయతీల్లో యంత్రాలు మాయంకావడంతో పక్క పంచాయతీల నుంచి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇటీవల ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతు చేయించాలని అధికారులు సూచిస్తున్నప్పటికీ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. డీజిల్, పెట్రోల్, లిక్విడ్‌లను సమపద్ధతుల్లో వినియోగించకపోవడం వల్ల యంత్రాలు చెడిపోయినట్లు తెలుస్తోంది. వాటి ఖర్చులు చేస్తున్నట్లు బిల్లులు రాసుకోవడం మాత్రం ఏ ఒక్క నెల ఆగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో చాలా వరకు గ్రామపంచాయతీల్లో వర్షాకాలం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు ఏ ఒక్క దగ్గరైనా ఫాగింగ్ మిషన్ దోమల మందు స్ప్రే చేసినట్లు అధికారులు గుర్తించినా, చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన విధించినప్పటి నుంచి కొన్ని పంచాయతీల్లో ఇప్పటి వరకు ఆ అధికారులు కనీస పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుధ్య నిర్వహణ దారుణమంగా మారింది. నిధుల సాకు చూపి అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో పచ్చగా ఉండాల్సిన పంచాయతీల్లో రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి. చాలా గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు మూలన పడేశారు.

కానరాని ఫాగింగ్....

గ్రామపంచాయతీల్లో వారంలో రెండుసార్లు ఫాగింగ్ చేపట్టాల్సి ఉంటుంది. వర్షాకాలం సీజన్ ప్రారంభంలో వీటి వినియోగం మరింత ఎక్కువగా చేసినప్పుడే దోమలను సగం వరకు నియంత్రణ చేయవచ్చు. గ్రామం మొత్తంగా నెలలో ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయడం లేదు. ఎక్కడనో ఒక్క దగ్గర పిచికారీ చేసిన సమయంలో తీసిన ఫొటోలనే ప్రతి నెలా వినియోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం

ప్రతీ గ్రామంలో దోమల నివారణకు చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. దోమల మందు పిచికారీ చేయాలని కార్యదర్శులకు సూచనలు చేస్తున్నాం. వ్యాధుల తీవ్రత దృష్ట్యా పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేకాధికారులు, మండలస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

– అక్తర్, ఎంపీవో, కోటపల్లి

'దివ్యాంగుల పెన్షన్ల పెంపే మంద కృష్ణ లక్ష్యం'



మాట్లాడుతున్న చెన్నూరి సమ్మయ్య

చెన్నూర్: దివ్యాంగులు, వృద్ధులు, వితంతు, గీతా, నేత, బీడీ కార్మికులకు పెన్షన్ పెంపే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ లక్ష్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య అన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్ల పెంపుపై ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ నెల 20న చెన్నూర్ నియోజకవర్గకేంద్రంలో సదస్సు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులు, గీతా, నేత, బీడీ కార్మికులు పెద్ద సంఖ్యంలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో చెన్నూర్ మండల ఇన్‌చార్జి సారంగం, రసపాక మల్లేశ్, నాయకులు చెన్నూరి శ్రీనివాస్, చకినారపు మల్లేశ్, తగరం చిరంజీవి, సమ్మయ్య, జాకీర్, సుగుణాకర్, రాజబాపులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు రాకేశ్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో సున్నంబట్టి వాడలోని లయన్స్‌క్లబ్‌లో ఆదివారం లయన్స్ క్లబ్, లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు చెందిన కీళ్ల ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ రాకేశ్, కొమురవెల్లి 150మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కారుకూరి చంద్రమౌళి, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కోశాధికారి రామస్వామి, ప్రోగ్రాం చైర్‌పర్సన్ సిరిపురం శ్రీనివాస్, సభ్యులు మధుసూదన్‌రెడ్డి, వినయ్‌కుమార్, గుండా శ్రీనివాస్, చందూరి మహేందర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మిక సంఘంలోకి విలీన గ్రామాల కార్మికులు



కార్మిక సంఘంలో చేరిన కార్మికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట, నంనూర్, నర్సింగాపూర్‌లలోని మున్సిపల్ కార్మికులు ఆదివారం తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘంలో చేరారు. సంఘం గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం ఆధ్వర్యంలో కార్మికులు స్వచ్ఛంధంగా సంఘంలో చేరగా, కార్మికుల సమస్యలను తెలుసుకొని త్వరలోనే సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విలీన ప్రాంతాలకు సంబంధించి సంఘం అధ్యక్షుడిగా చిప్పకుర్తి అశోక్, ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి మల్లేశ్, కోశాధికారులుగా గాడిపెల్లి స్వామి, చిప్పకుర్తి మహేందర్, ఉపాధ్యక్షులుగా గజ్జల రమేశ్, మిట్ట సంపత్, సలహాదారుడిగా చీమల రాజ్‌కుమార్‌లను నియమించారు.

దెబ్బతిన్న రోడ్డు పరిశీలన



నెన్నెల: భారీ వర్షానికి జెండా వెంకటాపూర్ సమీపంలోని సీసీ రోడ్డు దెబ్బతింది. కింది నుంచి బుంగపడి మట్టి మొత్తం కొట్టుకుపోయింది. పైన సీసీ రోడ్డు మాత్రమే మిగిలింది. పై నుంచి వాహనాలు వెళ్తే కూలిపోయే ప్రమాదం ఉంది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో అబ్దుల్‌హై, డీటీ ప్రకాష్ ఆదివారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. అటువైపుగా ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టారు. వెంటనే మరమ్మతు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించామని ఎంపీడీవో తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్‌లో ఆదివారం స్టీల్, సిమెంట్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజ్‌కుమార్ రెన్వా, సెక్రటరీగా వొజ్జల శ్రీధర్, కోశాధికారిగా మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంప రమేశ్, గౌరవ సలహాదారుగా జుగల్ కిషోర్ వ్యాస్‌లను ఎన్నుకున్నారు.

బోయపల్లిలో ఎక్కాహం



తాండూర్: మండలంలోని బోయపల్లి హనుమాన్ ఆలయంలో భక్తులు ఎక్కాహం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అటెన్షన్ ప్లీజ్..

వెలగని వీధి దీపాలు..!



భీమారం: మండలంలోని పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధి తాళ్ల గూడెంలో గత సంవత్సరం నుంచి వీధి దీపాలు ఏర్పాటు చేయడం లేదని స్థానికులు తెలిపారు. ఈ విషయం గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అధికారులు చిన్నచూపు చూస్తున్నారని వాపోయారు.

సంప్రదించాల్సిన అధికారి:
సతీశ్ రెడ్డి, ప్రత్యేకాధికారి, పోలంపల్లి
ఫోన్ నంబర్ : 9848384636

అందమైన సంధ్యాసమయం!



దండేపల్లి: పొద్దంతా మబ్బులతో కనిపించిన ఆకాశం సాయంత్రం సంధ్యావేళలో ఒక్కసారిగా సప్తవర్ణకాంతులతో మెరిసింది. ఆదివారం సాయంత్రం దండేపల్లి చెరువు గట్టు సమీపంలో కనిపించిన సంధ్యాసమయ అందాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

దోమతెరలు పంపిణీ

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ జీపీ పరిధిలో గల బిక్కగూడెంకు చెందిన నిరుపేద గిరిజన కుటుంబాలకు జిల్లా కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్లు, దోమతెరలు, రెయిన్‌కోట్లు ఆదివారం పంపిణీ చేశారు. కమ్మసేవా సమితి జిల్లా నాయకులు పాల్గొన్నారు.